కథ

# కుక్క కాటు

ఎల్.ఆర్.స్వామి

"నేను ఇంకా తిరగలేనే..." హాస్పిటల్‌లో, కుర్చీలో కూలబడుతూ అన్నాడు సునిల్.

"అలా, అంటే ఎలాగండి?" మనసులో కోపం పొంగుకొచ్చినా, అనునయంగా అన్నాను. "బాబు... బాబు... కొద్దిగా ఓపిక పట్టండి. రక్తం ఎక్కించకపోతే అది చస్తుందండి".

సునిల్ మాట్లాడలేదు. ఫాను తన వైపు తిప్పుకున్నాడు. షర్టు పై గుండి వొదలు చేసుకొని ఫానుకి ఎదురుగా నిలబడ్డాడు కర్చీఫుతో మెడ వొత్తుకున్నాడు. వానలో తడిసినట్లు కనబడ్డాడు, ఎండలో తిరిగి వచ్చిన అతడు.

"సన్ని ఫోను చేసాడండి" మళ్ళీ అన్నాను, నేను.

"రమ్మన్నాడు. రక్తం ఏర్పాటు చేస్తాడట".

సునిల్ నా మాటలు పట్టించుకోలేదు.

"ఏమండి" గోముగా అన్నాను. "ఈ ఒకసారి వెళ్ళిరండి".

సునిల్ కదలలేదు. నాకు కంగారు పుట్టుకొచ్చింది. రెండు గంటల టైం ఇచ్చారు డాక్టర్. ఆ లోగ రక్తం ఎక్కించాలట! గంటన్నర గడిచిపోయింది. రక్తం దొరకటం ఆలస్యమైతే... షైని కళ్ళు మూస్తే...

పద్మకి ఏం చెప్పగలను? షైని అంటే ఆమెకు ప్రాణం కన్నా ఎక్కువ.

కంగారుగా అటు ఇటూ చూసాను. మెడలో నెంబర్ బిళ్ళలు తగిలించుకుని గాజు గదిలో కదులుతున్నాయి కుక్కలు. ఆ గదిలో నుంచి కనబడింది బయట ప్రపంచం.

సునిల్ మెల్లగా లేచాడు.

"దేనికైనా పెట్టిపుట్టాలే". నీరసంగా కాళ్ళు ఈడ్చుకొని బయటకు నడుస్తూ గొణిగాడు "నీ కుక్క వల్ల, కుక్క బ్రతుకై పోయిందే. అంతా నీ వల్లే..."

ఆ మాటలు పట్టించుకోలేదు, నేను. సునిల్ ఎప్పుడూ, అంతే! తప్పంతా నాదే అన్నట్లు మాట్లాడుతాడు లేకపోతే ఇప్పుడు నేను చేసిన తప్పేంటి...

పొద్దున కుక్కని బయటకు పట్టుకెళ్ళమని సునిల్‌ని చాలా బతిమాలాను. హు... వా... వింటేనా... వినకపోవటం వల్లేగా, నేను వెళ్ళవలసి వచ్చింది. బలంగా నన్ను లాగుతూ కుక్క ముందుకు పరిగెత్తుతూ వుంటే కోచుకోలేక గొలుసు వొదిలేసాను. అది నా తప్పా...? పరిగెత్తి, పరిగెత్తి, కారుక్రింద పడింది. అదృష్టం బాగుండి మా సహోద్యోగి కారుక్రింద పడింది షైని. వెంటనే అతడు పశువుల డాక్టర్ వద్దకి తీసుకొచ్చాడు. ఇప్పుడు షైనికి రక్తం ఎక్కించాలని అంటున్నాడు, డాక్టర్! అదే 'బ్రీడ్' కుక్కని తెస్తే, ఆ కుక్క నుంచి షైనికి రక్తం ఎక్కిస్తాడట! అదే 'బ్రీడ్' కుక్క దొరకకపోతే... షైని కాని హరే అంటే...

అస్సలే కుక్క మాది కాదు. పద్మది. పద్మ మా మేనేజర్, ముక్కోపి. తన వద్ద పని చేసేవారిని పెంచటానికి తుంచటానికి అధికారమున్న ఆవిడ! పద్మకి ఈ సంగతి తెలిస్తే...

నాకు ముచ్చెమటలు పోసాయి. హ్యాండు బేగు నుంచి కర్చీఫు తీసి మోము, మెడ వత్తుకున్నాను. దేవుని ప్రీతి కోసం శివరాత్రి మరునాడు సముద్ర స్నానానికి వెళ్ళి, సుడిగుండంలో చిక్కుకున్నట్లు తోచింది, నాకు.

పద్మ ఊరు వెళ్తు కుక్కని నా వద్ద వుంచి వెళ్ళింది. నిజం చెప్పాలంటే పద్మని బతిమాలి షైనిని ఇంటికి తెచ్చుకున్నది, నేనే! సునిల్ అస్సలే ఒప్పుకోలేదు. "మన బ్రతుకే కుక్క బ్రతుకు. మేనేజర్లు వేసిన రొట్టె తిని బ్రతుకుతున్నాం. దీనికి తోడు కుక్క కూడానా..." సునిల్ గొంతు చించుకొని అరిచాడు" దానికి కూడా చాకిరి చెయ్యటం నా వల్ల కాదు".


"ఏదో పెద్ద చాకిరి చేసినట్లు..." నేను మూతి విరిచాను.

"నీవు తాగిన మంచి నీటిగ్లాసు కూడా నేనేగా తియ్యాలి... షైనిని తెచ్చుకుంటాను".

"ఒప్పుకోను" గొంతు పెంచాడు సునిల్. "కుక్క అంటే నాకు అసహ్యాం".

కుక్క అంటే నాకూ అసహ్యామే! కాని షైని మామూలు కుక్క కాదు, కదా! మా "బాస్‌గారి కుక్క! 'బాస్'కి చాలా ఇష్టమైన కుక్క! 'బాస్'కి ఇష్టమైనవన్ని నాకూ ఇష్టమవ్వాలి కదా! 'బాస్' ఇష్టానిష్టాలతో ఏకీభవించటమే కదా, ప్రైవేటు రంగ సంస్థలో పని చేసే నా లాంటి ఉద్యోగుల ఎదుగుదలకి తారక మంత్రం.

పద్మ ఊరు వెళ్తే, సాధారణంగా, షైనిని నా వద్ద విడిచిపెట్టదు. పద్మకి, నాకూ, అంత సాన్నిహిత్యం లేదు. సాన్నిహిత్యం



పెంచుకోవటానికి, తద్వారా వచ్చే లాభం పొందటానికే కదా, ఈ పథకం వేసాను.

"కుక్కని తెచ్చుకుంటే పద్మకి ఎలా దగ్గర అవుతావు?" సునిల్ అడిగాడు.

"ఓ మొద్దు ముఖమా... నీకు ఏం అర్థం కాదు" విసుక్కున్నాను నేను.

" 'బాస్'ని కుక్క ద్వారా మచ్చిక చేసు కోవచ్చు. ప్రమోషన్‌లు ఇంక్రిమెంటులు- అంతా బాస్ చేతిలోనేగా వుంటాయి. ఒక రూలా, పాడా...?"

"అలా అంటే నేను ఒప్పుకోను. ఏ కంపెనిలోనైనా దేనికైనా కొన్ని రూల్స్ వుంటాయి".

"అవన్ని మీ ప్రభుత్వ రంగ సంస్థలలో నండి, బాబు; బహుళజాతి సంస్థల్లో కాదు. ఇక్కడ అంతా 'బాసే'- 'బాసే' దేవుడు!"

సునిల్ మాట్లాడలేదు. గోడ మీద వేలాడే సర్వశక్తి స్వరూపిణి అయిన అమ్మ వారి కేలండరు చూస్తూ కూర్చున్నాడు. "అనిలని తెలుసు కదా....?" నేను అడిగాను. "సాధారణంగా కుక్కని అనిల వద్దే విడిచిపెడుతుంది, పద్మ".

"ఊఁ... ..." సునిల్ మూలిగాడు.

"అది నా కన్నా ఆరు నెలలు జూనియర్. అయినా ఈసారి ఖచ్చితంగా ప్రమోషన్ వస్తుందట, పద్మ దయ వల్ల..."

నా మాటల పట్ల ఆసక్తి చూపలేదు, సునిల్. రోడ్డు చూస్తూ కూర్చున్నాడు. రోడ్డు బాగా తయారుచేసినా సక్రమంగా వుంచవలసినవారి ప్రవర్తనా రీతులు వల్ల గతుకులుగా వుండటం గమనించి నిట్టూర్చాడు.

"అనిలకి ప్రమోషన్ వస్తే అది కుక్క వల్లేనండి" నేను మళ్ళీ అన్నాను. "డ్యూటి అయిపోగానే పద్మ ఇంటిలో వుంటుంది, అనిల. షైనికి సేవ చేసేది అదే".

"ఏం మాట్లాడుతున్నావే..." సునిల్ ఆశ్చర్యపోయాడు.

"ఉద్యోగంలో చేరినప్పుడు నోట మాట వచ్చేదికాదు నీకు".

"ఈ మాత్రం మాట్లాడలేకపోతే ఎలా గండి, బాబు...?" నేను అన్నాను. "కాల్ సెంటర్ ఉద్యోగమా, మజాకా...?"

రెండేళ్ళ క్రితమే ఒక బహుళజాతి సంస్థ వారి "కాల్ సెంటర్"లో చేరాను. చేరిన కొత్తలో నా పెదవి పెగిలేది కాదు. ఎవరైనా పలుకరిస్తే, ముడుచుకుపోయే దాన్ని. నా తోటి ఉద్యోగులు, అప్పుడు నన్ను చూసి నవ్వుకునేవారని ఇప్పటి నా మిత్రురాలు, గీత చెప్తూ వుంటుంది. చీర కట్టుకొని కొంగు పూర్తిగా కప్పుకొని, పెద్ద బొట్టు పెట్టుకొని వెళ్ళే నన్ను "అమ్మమ్మ" అని సంబోధించి ఎగతాళి చేసేవారట!

"ఇలా వుంటే లాభం లేదే" ఒక నెల రోజులు తరువాత, నాతో కొంత సాన్నిహిత్యం ఏర్పడ్డాక ఒక రోజు గీత అంది. "ఇక్కడ పని చేసేటప్పుడు ఇక్కడి వాతావరణానికి 'ఎడ్జెస్టు' అయిపోవాలి" భోజనానికి "ఆర్డర్" చేసి చేతి అద్దంలో చూస్తూ ముంగురులు సవరించుకుంటూ అంది గీత.


"అంటే... పాంట్లు గౌన్లు వేసుకొని తిరగమంటావా... దయ్యంలా జుట్టు విరగ బోసుకొని తిరగాలా... నా వల్ల కాదే..."

"కాకపోతే నిన్ను ఆట పట్టిస్తారు. ఇప్పటికే నీకు "అమ్మమ్మ" ముద్ర వేసారు. "రోం"లో వున్నప్పుడు "రోమన్"గా వుండాలే". బుగ్గలపై ఎర్ర పౌడర్ అద్దుకుంటూ, గీత మళ్ళీ అంది. "ఇదిగో, ఇక్కడే చూడు; అందరూ "పీజాలు" "నాన్‌లు" తింటున్నారు. నువ్వు మాత్రం రంగు వెలిసిన ప్లాస్టిక్ డబ్బాలో పెరుగన్నం తెచ్చుకొని తింటున్నావు".

"ఇది నా అలవాటు..."

"అలవాట్లు మార్చుకోవాలే, తల్లీ. మనిషి పరిస్థితులకు తగినట్లు మారాలి. మారకపోతే జీవితంలో పైకి రాలేమే..." హ్యాండు బేగు మూసి మళ్ళీ అంది. "పని అందరూ చేస్తారు. అందువల్ల పని చేసి బాస్ దృష్టికి రాలేం. "బాస్" దృష్టిలో పడుతేగా ఉద్యోగంలో పైకి రావటం. అందుకే పనితో పాటు బాస్ దృష్టిని ఆకర్షించాలి కూడా..."

"అంటే..."



"బాస్ పిల్లలని, కుక్కపిల్లలని బుజ్జగించటం, 'బాస్'కి కిట్టనివారి గురించి వార్తలు మొయ్యటం, వారిని మనం కూడా తిట్టటం..."

"బాబోయి..."

"బాగా అర్థం చేసుకో. మరో హారి అవకు".

తల యెత్తి చూసాను. జుట్టు నెరిసిన హారి "హెడ్‌సెటు" తగిలించుకొని "కాల్స్" తీసుకోవటం గాజుగోడలో నుంచి కనబడింది.

మా "కాల్ సెంటర్"లో ఆరేళ్ళ అనుభవం, హారిది. పనిలో దిట్ట. మేనేజరు కూడా, పనిలో సందేహాలు వస్తే హారినే అడుగుతాడు. కాని అతనికి ప్రమోషన్ రాదట! ఎందుకంటే అతడు ఎవరిని పట్టించుకోడట! ఏ గ్రూపులోను లేదు కనుక ఎవ్వరూ అతన్ని పట్టించుకోరట! ఎవరైనా పట్టించుకొని ప్రయత్నం చేస్తే హారి, మానవ సంబంధాల్లో చాలా "పువర్" అని అంటారట!

**నిజమే! బాగా మారాను! బట్టలు వేసుకునే విషయంలోనే కాదు- మాటలో, ఆలోచనాసరళిలో అంతా మార్పు వచ్చింది. ఇప్పుడు నిర్భయంగా ఎవరితోనైనా మాట్లాడగలుగుతున్నాను. చీకటి పడితే బయటకు వెళ్ళటానికి భయపడిన నేను, రాత్రి పది గంటలు దాటినా ఒంటరిగా స్కూటర్‌లో తిరిగి వస్తున్నాను.**

నేను ఒక నిమిషం మాట్లాడలేదు. ఆ తరువాత అడిగాను.

"జూనియర్లకు కూడా ప్రమోషన్ ఇచ్చారు కదా. మరి హారికి ఇవ్వకపోవటం అన్యాయం కదా...?"

"అన్యాయమేముంది? ఉద్యోగం ఇచ్చినప్పుడు ప్రమోషన్ ఇస్తామని అన్నారా? చూడు ఉద్యోగం ఒక ఒప్పందం- నీకు యాజమాన్యం వారికి మధ్య ఏర్పడిన ఒప్పందం- ఒక ప్రత్యేక పని చెయ్యటానికి నీవు, ఆ పనికి ఒక నిర్ణీత వేతనం ఇవ్వటానికి యాజమాన్యంవారు ఒప్పుకున్నారు. నువ్వు ఒప్పుకున్న పని చేస్తున్నావు. వారు ఒప్పుకున్న జీతం ఇస్తున్నారు, అంతే...".

సంవత్సరం గడిచిపోయింది.

"నువ్వు బాగా మారిపోయావే..." పాంటు వేసుకొని వెళ్ళిన నన్ను చూసి గీత అంది.

నిజమే! బాగా మారాను! బట్టలు వేసుకునే విషయంలోనే కాదు- మాటలో, ఆలోచనాసరళిలో అంతా మార్పు

వచ్చింది. ఇప్పుడు నిర్భయంగా ఎవరితోనైనా మాట్లాడగలుగుతున్నాను. చీకటి పడితే బయటకు వెళ్ళటానికి భయపడిన నేను, రాత్రి పది గంటలు దాటినా ఒంటరిగా స్కూటర్‌లో తిరిగివస్తున్నాను. బహుళజాతి సంస్థ ప్రభావం వల్ల చిన్న పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరిని పేరు పెట్టి పిలుస్తూ ఏక వచన ప్రయోగం చేస్తూ మాట్లాడుతున్నాను- చివరికి ఆయనని కూడా. ఉద్యోగంలో పైకి రావాలనే తపన కూడా పెరిగింది. రోజులు గడచినకొద్దీ గీత మాటల్లో నిజముందేమోనని కూడా అనిపించింది. అనిలకి ఇచ్చిన ప్రమోషన్ నా ఆలోచనని బలపరిచింది.

ముగ్గురు సీనియర్లని దాటించి ప్రమోషన్ ఇచ్చారు అనిలకి. ఉద్యోగులకు ఒళ్ళు మండింది. వాళ్ళల్లో వాళ్ళు గుసగుసలాడారు. రహస్యంగా మేనేజర్లని తిట్టారు. మేనేజర్లని అడుగుదాం, కలిసివెళ్దాం అంటే ఎవరూ ముందుకు రాలేదు. అస్సలే వాళ్ళకి యూనియన్ లేదు. ఉద్యోగం పోతే.

"దానికి ప్రమోషన్ ఏమిటి...?" ఒక అమ్మాయి ప్రశ్న.

"అనుకున్నదే కదా... అది పద్మకి కుక్కకాపిరి కదా...?"

"కుక్కేంటి...?"

"నీకు తెలియదా? పద్మకి ఒక ఖరీదైన కుక్క ఉంది..."

"మొన్నటివరకు లేదే. కొనుక్కుందా?"

"కొనుక్కుందో... ఎవరిదైనా తెచ్చుకుందో నాకేం తెలుసు? ఇప్పుడు కుక్క ఉంది. నెలకి అయిదారువేలు ఖర్చుట. ఆ కుక్కకి సేవలు ఈవిడే చేస్తుందట!"

"అయితే ప్రమోషన్ కోసం కుక్కదేవుడుని సేవించాలన్నమాట".


అందరూ పకపకా నవ్వారు. నాకు నవ్వు రాలేదు. మరునాడే ఒక 'స్వీటు పాకెటు' తీసుకొని పద్మ ఇంటికి వెళ్ళాను. చాలా సిగ్గు అనిపించింది, నాకు. శీలాన్ని తాకట్టు పెడుతున్నట్లు తోచింది.

బాగానే మాట్లాడింది పద్మ. ఇంటి విషయాలు అడిగింది. చేసే పనిలోని ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకుంది. మేనేజర్ల గురించి తోటి ఉద్యోగుల మాటలు కూడా అడిగి తెలుసుకుంది.

కుక్క అంటే నాకు చాలా ఇష్టమని షైనిని చూడటం కోసం కూడా వచ్చానని అబద్ధమాడాను. తీరిక దొరికనప్పుడల్లా వస్తూ వుండమని చెప్పింది, పద్మ.

రెండు నెలలు గడిచాక, అదృష్టం కుక్క రూపంలో ఇంటికి వస్తోందని తెలిసి పొంగిపోయాను.పద్మ ఊరు వెళ్తున్నట్లూ, కుక్కని నా వద్ద వదులుతున్నట్లు చెప్పింది. కాని సునిల్ ఒప్పుకోలేదు. "కుక్కని మేపటం నా వల్ల కాదు" అతడు తేల్చి చెప్పేసాడు.

"మీరేం మేపనక్కరలేదు" కోపంగా




అన్నాను. "పద్మ డబ్బు ఇస్తుంది".

కుక్క ఖర్చు పద్మే భరిస్తుందని అనిల అనుభవం మీద నాకు చెప్పింది. అంతేకాదు పద్మ విదేశాలకు వెళ్ళివచ్చినప్పుడు విదేశీయ సెంటులు, సబ్బులు కూడా తెచ్చి ఇస్తుందట!

సెల్ మ్రోగింది. పాంటు పాకెటు నుంచి సెల్ తీసాను.

"సన్ని కుక్కని ఇవ్వటం లేదే" సునిల్ గొంతు-

"ఇస్తానని అన్నాడుగా..."

"డబ్బులు అడుగుతున్నాడు... పది వేలు..."

"పది వేలే...!"

"అవును. అతని కుక్క చాలా ఖరీదైనదట! రక్తం ఇవ్వటం వల్ల దానికి ఏదైనా అయితే..."

"డబ్బు బ్యాంకు నుంచి తీసుకో".

"బ్యాంకు నుంచే మాట్లాడుతున్నాను. బాలెన్స్ లేదే". నేను షాకైనాను.

"మొన్ననేగా, వీక్ ఎండ్ షాపింగ్ చేసావు..."

చేసే ఉద్యోగంతో వచ్చిన అలవాటుల్లో "వీక్ ఎండ్" షాపింగ్ ఒకటి. షాపింగ్ ఇప్పుడు ఒక ఆడంబరం. అవసరమున్నా, లేకపోయినా, "వీక్ ఎండ్"లో షాపింగ్ చెయ్యాల్సిందే. షాపింగ్ చెయ్యలేదని తోటి ఉద్యోగినులతో చెప్పుకోవాలంటే నామోషిగా వుంటుంది.

"మాట్లాడవేంటి, ఏం చెయ్యమంటావు?"

"ఏదో ఒకటి చెయ్యండి" విసుగు, కోపం, బాధ- అన్ని నా గొంతుని కఠినంగా మార్చాయి". ఎక్కడైనా అప్పు చెయ్యండి. దొరకకపోతే వుందిగా మెడలో గొలుసు- అమ్మేయండి. ఏం చేసినా పర్వాలేదు. మరో పది నిమిషాల్లో ఇక్కడ వుండాలి, కుక్కతో..."

కుర్చీలో కూలబడ్డాను. కళ్ళు మూతలు పడ్డాయి.

"వెయిర్... వెయిర్ ఈస్ మై షైని? (ఎక్కడ... ఎక్కడ నా షైని?) గట్టిగా అడగటం విని ఉలిక్కిపడి లేచాను. ఎదురుగా నిలబడి వున్నాడు ఒక దొర- పక్కనే గీత, సన్ని- సన్నితో అతనితో కుక్క-

"వాట్ హాప్పెండు టు మై షైని...? (నా షైనికి ఏమైంది?) గట్టిగా అడుగుతూ, లోపలకు వెళ్ళాడు దొర- వెనుక సన్ని కూడా-

"వీడెవుడే... కుక్క గురించి అడుగుతున్నాడు?"

"ఇతనే మన కంపెని హెడ్" గీత అంది.

"ఎప్పుడూ చూడలేదే..."

"ఇక్కడే వుండేవాడు. ఏడాదిగా పని మీద 'లండన్'లో వున్నాడట. నిన్ననే వచ్చాడు".

"మరి షైని గురించి..."

"షైని అతనిదే..." నేను ఖంగుతిన్నాను.

" 'లండన్' వెళ్తూ వచ్చేంతవరకు చూసుకోమని పద్మకి ఇచ్చాడట".

"అంటే... పద్మ కూడా..."

"ఇంకా విడమర్చి చెప్పాలా..."

నాకు ముచ్చెమటలు పోసాయి. ఇప్పుడు ఈ దొర ఏం చేస్తాడో... అసలే కంపెని హెడ్.

"ఈ విషయం దొరకి ఎలా తెలిసిందే?"

"సన్ని చెప్పాడట. సునిల్ సన్ని వద్దకు కుక్క గురించి వెళ్ళాడట, కదా. కుక్కని మీకు ఇస్తే అతనికి ప్రయోజనం ఏమిటి? అందుకే దొరకి విషయం చెప్పి దొరతో కలిసివచ్చాడు కుక్కతో".

నాకు నోట మాట రాలేదు. అలా నిలబడ్డాను. ఎవరో భుజం మీద చెయ్యి వేసినట్లైంది. తిరిగి చూసాను- పక్కనే నిలబడి వున్నాడు, సునిల్.

"ఇదిగోనే డబ్బు" సునిల్ అన్నాడు. "గొలుసు అమ్మేసాను. డబ్బుతో సునిల్ ఇంటికి వెళ్తే అతడు కనబడలేదే..."

నా బుర్ర తిరిగిపోయింది. పులిని చూసి నక్క వాత పెట్టుకోకూడదని చిన్నప్పుడు అమ్మమ్మ చెప్పిన మాట గుర్తుకు వచ్చింది.